నేడు పిజిఆర్ఎస్ రద్దు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో రానున్న మూడు రోజులు అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈనెల 18వ తేదీ సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో జరగాల్సిన పిజిఆర్ఎస్ రద్దు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఏజెన్సీ బెంబేలు.. కొల్లేరులో కలవరం..!

- జిల్లాను చుట్టుముడుతున్న వరద
- భద్రాచలం వద్ద 34 అడుగులకు చేరిన గోదావరి నీటిమట్టం
- 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- పొంగుతున్న గుండేటి, ఎద్దు వాగులు
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజల్లో ఆందోళన
- కొల్లేరులో పెనుమాక గ్రామం రహదారిపైకి వరదనీరు
- భయంభయంగా లంక గ్రామాల ప్రజలు
- పెదఅడ్లగాడి వద్ద 2.46 మీటర్లకు చేరిన నీటి మట్టం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూములు ఏర్పాటు..
- పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాను వరద చుట్టుముడుతున్న పరిస్థితి నెలకొంది. గోదావరి వరద ఉధృతి పెరుగుతుండగా, కొల్లేరుకు వరద నీరు పోటెత్తుతోంది. దీంతో అటు ఏజెన్సీ ప్రజలు, ఇటు కొల్లేరు లంక గ్రామాల ప్రజలు భయాందోళనలతో కాలం వెళ్లదీస్తున్న పరిస్థితి. గత ఏడాది వరద పరిస్థితులను గుర్తుచేసుకుని ఏజెన్సీ, కొల్లేరు ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఆదివారం సాయంత్రానికి భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 33.70 అడుగులకు చేరింది.

పట్టిసీమ వద్ద పెరుగుతున్న వరద

సోమవారం ఉదయానికి మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో భద్రాచలం వద్ద 5.57 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో పోలవరం స్పిల్‌వే వద్ద నీటి మట్టం 30 అడుగులను దాటేసింది. దిగువకు ఐదు లక్షల 52 వేల క్యూసెక్కులపైగా నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. గడిచిన నెలలో రెండు సార్లు గోదావరికి వరద పోటెత్తింది. వెంటనే తగ్గుముఖం పట్టడంతో అక్కడి ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 40 అడుగులు దాటితే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 35కు పైగా గ్రామాలు ముంపు బారిన పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే కుక్కునూరు, దాచారం మధ్యలో ఉన్న గుండేటివాగు పొంగిపొర్లుతుండడంతో 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలంలో ఎద్దువాగుపై కాజ్‌వే పైనుంచి నీరు చేరడంతో కొయిదా, తాళ్లగొంది, పూచిగొంది, కాకిసనూరు, వంటి 20 గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఏటా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు వరదలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిర్వాసితులకు ఇవ్వాల్సిన పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, 18 ఏళ్ళ నిండిన యువతకు పరిహారం, కాలనీలు నిర్మాణం వంటి ఏ ఒక్కటి సక్రమంగా చేయకుండా నిర్వాసితులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ ఏడాది మే నెల నాటికి 41.15 కాంటూరు పరిధిలోని గ్రామాలకు పునరావాసం, ఆర్అండ్ఆర్ పూర్తిచేస్తామని ప్రభుత్వం చెప్పినా చేయలేదు. దీంతో నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. తమకు వెంటనే పరిహారం అందించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

కొల్లేరుకు వరద కలవరం..

బుడమలేరుతోపాటు ఎగువ ప్రాంతాల నుంచి కొల్లేరుకు పెద్దఎత్తున వరదనీరు వచ్చిపడుతోంది. దీంతో కొల్లేరులో వరద పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పెద్దఅడ్లగాడి వద్ద కొల్లేరు నీటిమట్టం 2.46 మీటర్లకు చేరింది. దీంతో పెనుమాకలంక రహదారిపైకి వరద నీరు చేరుకుని పెదఅడ్లగాడి, పెనుమాకలంక, నందిగామ, శ్రీరామ్‌నగర్ మీదుగా సిద్ధాపురానికి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పడవలపై అక్కడి ప్రజలు ప్రయాణిస్తున్న పరిస్థితి. ఒకవైపు వర్షాలు, మరోవైపు వరదనీటితో లంక గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పెద్దఅడ్లగాడి వద్ద మూడు రోజులకు కొల్లేటి నీటిమట్టం పెరిగితే కొల్లేరులోని చాలా గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోనున్నాయి. ఇక్కడికి నీరు చేరే ప్రమాదం పొంచి ఉంది. ఎగువ ప్రాంతాల్లోని ముంపు నీరు 64 డ్రెయిన్ల ద్వారా ప్రవహిస్తూ వచ్చి కొల్లేరు ద్వారా సముద్రంలోకి చేరుతాయి. కొల్లేరులో అక్రమంగా తవ్విన చేపల చెరువులు, ఆక్రమణల కారణంగా వరదనీరు ముంచెత్తుతోంది. పెదఅడ్లగాడి వంతెన వద్ద భారీ స్థాయిలో గుర్రపు డెక్క పేరుకుపోయింది. దాన్ని సకాలంలో తొలగించకపోవడంతో ముంపునకు మరో కారణంగా కనిపిస్తోంది.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌లు.. పిజిఆర్ఎస్ రద్దు

పెరుగుతున్న వరద నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టరేట్‌లో 18002331077, 9491041419 ఫోన్ నెంబర్లతో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రజలు నదిలోకి వెళ్లొద్దని, ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం వంటివి చేయొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో సోమవారం జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని అధికారులు రద్దు చేశారు.

80 శాతం సబ్సిడీపై రైతులకు డ్రోన్లు..!

- ఖరీఫ్‌లో 2.08 లక్షల ఎకరాల్లో వరిసాగు
- 90 శాతం వరకూ నాట్లు పూర్తి
- ప్రస్తుత సీజన్‌లో ఇప్పటికే 32 డ్రోన్లు అందజేత
- కౌలురైతులకు రూ. వంద కోట్ల వరకూ రుణాలు మంజూరు
- అన్నదాత సుఖీభవ సొమ్ములు 99.97 శాతం మంది రైతులకు జమ
- యూరియా కొరత లేదు
- వ్యవసాయ శాఖ జిల్లా అధికారి జెడ్.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వ్యవసాయ రంగంలో సాంకేతికను రైతులకు మరింత చేరువ చేయాలన్న లక్ష్యంతో రూ.పది లక్షల విలువ చేసే డ్రోన్లను 80 శాతం సబ్సిడీతో ప్రభుత్వం రైతులకు అందిస్తోందని, ప్రస్తుత సీజన్‌లో ఇచ్చిన టార్గెట్ దాదాపు పూర్తయ్యిందని జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. 'ప్రజాశక్తి' నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎన్ని ఎకరాల్లో వరి సాగవుతోంది. ఎంతమేర నాట్లు పూర్తయ్యాయి, కౌలురైతులకు కౌలు కార్డుల జారీ, బ్యాంకు రుణాలు మంజూరు, 'పొలం పిలుస్తోంది' అమలు, యూరియా నిల్వలు, అన్నదాత సుఖీభవ సొమ్ములు జమ వంటి పలు విషయాలపై ఆయన వివరించారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ములు ఎప్పటిలోగా జమవుతాయి వంటి విషయాలను వివరించారు.

ప్రశ్న : ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా ఎంత మేర వరిసాగు సాగుతోంది. నాట్లు ఎంత వరకూ పూర్తయ్యాయి?

జెడి : ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2.08 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. ఇప్పటి వరకూ లక్షా 80 వేల ఎకరాల్లో దాదాపు 90 శాతం నాట్లు పూర్తయ్యాయి.

ప్రశ్న : ఖరీఫ్‌లో రైతులు ఏ విత్తనాలు ఎక్కువగా సాగు చేశారు?

జెడి: 1318, స్వర్ణ, సంపత్ స్వర్ణ వంటి విత్తనాలు రైతులు ఎక్కువగా సాగుచేశారు.

ప్రశ్న : ప్రస్తుత సీజన్‌లో ఎన్ని డ్రోన్లు రైతులకు అందించాలని టార్గెట్ పెట్టుకున్నారు. ఇప్పటి వరకూ ఎన్ని డ్రోన్లు అందించారు? సబ్సిడీ ఎంత? నిబంధనలు ఏమిటి?

జెడి: ఈ సీజన్‌లో 45 డ్రోన్లు రైతులకు అందించాలని టార్గెట్‌గా పెట్టుకున్నాం. ఇప్పటి వరకూ 42 డ్రోన్లకు సంబంధించి రైతుల ఎంపిక ప్రక్రియ పూర్తయ్యింది. 32 డ్రోన్లు రైతులకు అందించాం. డ్రోన్ ఖరీదు దాదాపు రూ.పది లక్షలు, ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో అందిస్తోంది. ఐదుగురు అంతకు మించి రైతులు గ్రూపుగా ఏర్పడితే అన్నీ పరిశీలించి ఈ డ్రోన్లు ఇవ్వడం జరుగుతోంది.

ప్రశ్న: జిల్లాలో యూరియా కొరత ఏమైనా ఉందా?

జెడి: జిల్లాలో యూరియా కొరత లేదు. ఖరీఫ్ సీజన్‌లో 21,270 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం అవుతుందని అంచనా వేశాం. ఇప్పటి వరకూ రూ.18 వేల మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు చేరింది. 12 వేల మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చాం. ఇంకా ఆరువేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న: జిల్లాలో అన్నదాత సుఖీభవ ఎంతమంది రైతులు అర్హత సాధించారు. సొమ్ములు అందరికీ జమయ్యాయా?

జెడి : జిల్లాలో లక్షా మూడు వేల మందికిపైగా రైతులు అన్నదాత సుఖీభవ అర్హత జాబితాలో ఉన్నారు. వీరిలో 99.97 శాతం మంది రైతులకు సొమ్ములు జమయ్యాయి.

ప్రశ్న : అన్నదాత సుఖీభవకు సంబంధించి ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా?

జెడి: రెండు వేల మందికి సంబంధించి ఎన్‌పిసిఐ మ్యాపింగ్ జరగలేదు. జాబితా పంపించాం. వీరంతా ఇతర ప్రాంతాల్లో ఉండటంతో లింక్ జరగలేదు. మరణించిన రైతుల సంఖ్య 14 వేల వరకూ ఉంది. వారి వారసులు మ్యూటేషన్ చేయించుకుంటే అన్నదాత సుఖీభవ సొమ్ములు అందుతాయి.

ప్రశ్న: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కౌలురైతులకు టార్గెట్ ఎంత? ఇప్పటి వరకూ ఎన్ని ఇచ్చారు. పంట రుణాలు మంజూరు చేశారా?

జెడి: ఈ ఏడాది లక్షా ఐదు వేల కౌలు కార్డులు జారీ చేయాలని లక్ష్యం నిర్దేశించుకోగా, ఇప్పటివరకూ 70 వేలకుపైగా కార్డులు ఇచ్చాం. ఇప్పటి వరకూ దాదాపు 15 వేల మంది రైతులకు రూ.వంద కోట్ల వరకూ పంట రుణాలు మంజూరయ్యాయి.

ప్రశ్న: 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ఏవిధంగా జరుగుతోంది?

జెడి: వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరుగుతోంది. ఒకచోట ఆరోజు ఏదైనా సమస్య వస్తే తర్వాత నిర్వహిస్తారు. ప్రస్తుతం పంటల సాగులో రైతులు ఏవిధంగా ముందుకు సాగాలనే అంశాలను వివరిస్తారు. రైతుల అనుమానాలు నివృత్తి చేస్తారు. వారంలో రెండు గ్రామాల్లో ఇది జరుగుతోంది. వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన అధికారులంతా పాల్గొంటారు.

వైభవంగా మంత్రి నిమ్మల కుమార్తె నిశ్చితార్థం

హాజరైన మంత్రి లోకేష్ - గజమాలతో స్వాగతం పలికిన మంత్రి రామానాయుడు - విచ్చేసిన స్పీకర్లు, మంత్రులు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, అధికారులు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు ఇంట ఆదివారం నిశ్చితార్థ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం 7.16 నిమిషాలకు శుభముహూర్తంలో పాలకొల్లులోని ఎస్ కన్వెన్షన్‌లో మంత్రి రామానాయుడు కుమార్తె శ్రీజ, పవన్ నిశ్చయ తాంబూలాల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు, సూర్యకుమారి దంపతులు, ఇర్రింకి వెంకట సూర్యనారాయణ, కరుణమణి దంపతులు కుటుంబ సభ్యులు, బంధువుల మధ్య తాంబూలాలు స్వీకరించారు. కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారాలోకేష్‌ను గజమాలతో మంత్రి రామానాయుడు సత్కరించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్, శ్రీజను లోకేష్ ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే విచ్చేసిన కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు, శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, కొలుసు పార్థసారథి, కందుల దుర్గేష్, బిసి జనార్దన్ రెడ్డి, కొండపల్లి శ్రీనివాసరావు, వాసంశెట్టి జనార్ధన్, సంధ్యారాణి, ఎంపి బీద మస్తాన్‌రావుకు స్వాగతం పలికారు. మాజీ ఎంపీలు కనుమూరి బాపిరాజు, చేగొండి వెంకట హరి రామ జోగయ్య, గోకరాజు గంగరాజు, తోట సీతారామలక్ష్మి, ఎంఎల్ఎలు పితాని సత్యనారాయణ, పులపర్తి రామాంజనేయులు, ఆరిమిల్లి రాధాకృష్ణ, చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, పి.ధర్మరాజు, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, చిర్రి బాలరాజు, డిసిసిబి ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, మాజీ ఎంఎల్ఎలు సిహెచ్.సత్యనారాయణమూర్తి, అల్లువెంకట సత్యనారాయణ, శివరామరాజు, బూరుగుపల్లి శేషారావు, కొత్తపల్లి జానకీరామ్, రాజశేఖర్, మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, పలు కార్పొరేషన్ ఛైర్మన్లు ఎంఎ షరీఫ్, కొత్తపల్లి సుబ్బారాయుడు, పీతల సుజాత, మునిరత్నం, రాజశేఖర్, కలెక్టర్ చదలవాడ నాగరాణి, జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి తదితర అధికారులు విచ్చేశారు. వారిని మంత్రి రామానాయుడు సత్కరించారు. ఉదయం నుంచి పండుగ వాతావరణంలో సాగిన ఈ వేడుకలకు వేలాది మంది హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకకు భారీ ఏర్పాట్లు చేశారు.



మంత్రి కుమార్తె నిశ్చితార్థానికి హైజరై వారికి శుభాకాంక్షలు తెలుపుతున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు

గిరిజన, స్త్రీ సంక్షేమానికి కృషి : మంత్రి సంధ్యారాణి

అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - పాలకొల్లు

గిరిజనుల సంక్షేమం, స్త్రీలు, పిల్లల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గిరిజన, స్త్రీ, శిశుసంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఆదివారం మంత్రి నిమ్మల కుమార్తె శ్రీజ నిశ్చితార్థానికి విచ్చేనా మంత్రి సంధ్యారాణి వారిని ఆశీర్వదించారు. అనంతరం గిరిజన, స్త్రీ, శిశుసంక్షేమ శాఖల అధికారులతో పాలకొల్లులో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై సమగ్రంగా సమీక్షించారు. ముఖ్యంగా 1626 అంగన్వాడీ కేంద్రాల పనితీరు, పిల్లలకు అందుతున్న పోషకాహారం, విద్య, ఆరోగ్య పరిరక్షణ వంటి అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలికలకు పౌష్టికాహారం అందించాలనే దానిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గ్రామస్థాయి వరకూ పథకాల అమలులో పారదర్శకత, వేగవంతం అవసరమన్నారు. లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా, అవినీతి రహితంగా సంక్షేమ పథకాలు చేరేలా అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

శ్రీరామ్మూర్తి త్యాగం వెలకట్టలేనిది

వర్ధంతి కార్యక్రమాల్లో సిపిఎం నేతలు



తణుకులో శ్రీరామమూర్తి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి - తణుకు

పేదల రాజ్య స్థాపన కోసం అహర్నిశలు కృషిచేసిన వ్యక్తి వలవల శ్రీరామమూర్తి అని సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. ఆదివారం స్థానిక అమరవీరుల భవనంలో సిపిఎం ఆధ్వర్యంలో వలవల శ్రీరామమూర్తి ప్రధమ వర్ధంతిని నిర్వహించారు. జోహార్ శ్రీరామమూర్తి, సాధిస్తాం శ్రీరామమూర్తి ఆశయాలు అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభనుద్దేశించి సీతారాం, గోపాలన్‌లు మాట్లాడుతూ.. వలవల శ్రీరామమూర్తి ఉపాధ్యాయ జీవితం ద్వారా ఎంతోమందిని విద్యాధికులుగా తయారుచేశారని అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉండగానే ఈ సమాజంలో జరుగుతున్న అన్ని పరిణామాలు అవగాహన చేసుకొన్నారన్నారు. అతితక్కువ కాలంలో ఉపాధ్యాయ జిల్లా నేతగా ఎదిగి సమస్యల పరిష్కారం కోసం అలుపెరుగని పోరాటం సాగించారని అన్నారు. తరువాత కాలంలో ఈ సమాజం మార్పుకోసం ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజా ఉద్యమాలలో పని చేయడానికి సిపిఎంలో చేరారన్నారు. సిపిఎం పూర్తి కాలం కార్యకర్తగా ప్రజలు, ఉద్యోగులు, రైతులు, కార్మికులు వంటి వారి సమస్యలపై పోరాటాలు ముందుండి నిర్వహించారని తెలిపారు. కులం, మతం, దోపిడీ లేని సమాజం కోసం తుది శ్వాస విడిచే వరకు ఎర్రజెండా పక్షాన నిలిచారన్నారు. శ్రీరామమూర్తి తన పార్థివ దేహాన్ని కూడా వైద్య విద్యార్థుల పరిశోధనలు కోసం ఆశ్రమ హాస్పిటల్‌కి ఇచ్చారని తెలిపారు. తొలుత శ్రీరామమూర్తి చిత్రపటానికి మంతెన సీతారాం, జెఎన్‌వి గోపాలన్, పివి.ప్రతాప్, ఎ.అజయ కూమరి పూలమాలతో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కామన మునిస్వామి, పి.దక్షిణా మూర్తి, పిఎల్.నర్సింహారావు, అంబటి రామకృష్ణ, ఎం.గంగాధర్ రెడ్డి, ఉషా పాల్గొన్నారు.

యలమంచిలి : సిపిఎం సీనియర్ నేత వలవల శ్రీరామమూర్తి త్యాగం వెలకట్టలేనిదని ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు అన్నారు. మండలంలోని చించినాడ అమరవీరుల స్మారక భవనంలో అమరజీవి వలవల శ్రీరామమూర్తి మొదటి వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సభకు సీనియర్ నాయకులు దేవ సుధాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ.. తాను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఆచరించి, ఉపాధ్యాయ వృత్తిని సైతం వదులుకొని, తన జీవిత చరమాంకం వరకు ప్రజా ఉద్యమాలే ఊపిరిగా పేద, బడుగు, బలహీన తరగతులు, రైతుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారన్నారు. అటువంటి త్యాగధనుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని పనిచేయడమే వారికి అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. ముందుగా శ్రీరామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, జిల్లెల్ల ప్రశాంతి, ముస్కుడి జయశ్రీ, కోరం వెంకటేశ్వరరావు, నేలపాటి లూదర్ బాబు, కేత శ్రీను పాల్గొన్నారు.

పాలకొల్లు : వలవల శ్రీరామమూర్తి ఆశయాలకై పనిచేయడమే ఆయనకిచ్చే ఘనమైన నివాళులు అని మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్ అన్నారు. ఆదివారం శ్రీరామమూర్తి ప్రధమ వర్ధంతి సందర్భంగా పాలకొల్లులో సిపిఎం కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో ఉండగా సంఘ నిర్మాణంలో ముఖ్య పాత్ర వహించారన్నారు. సిపిఎం సిద్ధాంతం వైపు ఆకర్షితులై వాలంటరీ రిటైర్మ్‌మెంట్ తీసుకొని పార్టీ బాధ్యతలు తీసుకున్నారని అన్నారు. నర్సాపురం తాలూకా పార్టీ కార్యదర్శిగా, రైతు రాష్ట్ర నాయకులుగా బాధ్యతలతో పనిచేసారని తెలిపారు. దొంగరావిపాలెం ఎత్తిపోతలు, నక్కల కాలువ స్లూయిస్ షటర్స్ సమస్యలపై రాజీలేని పోరాటం చేసారన్నారు. కొబ్బరి, తమలపాకులు, వరి రైతుగా సమస్యలు తీసుకొని నిరంతరం పనిచేసారన్నారు. ఆయన లేని లోటు పూరించలేనిదని రాజగోపాల్ అన్నారు. తొట్టెంపూడి కోటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జవ్వాది శ్రీనివాసరావు, పట్టణ శాఖ కార్యదర్శి చల్లా సోమేశ్వరరావు, కె. రాయపరాజు మాట్లాడారు. యర్రా కృష్ణారావు, జె.లక్ష్మి, పి.సాంబశివరావు, యాకల రాము, తిరుమాని శ్రీనివాస్, వి.రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి కుమారులు వలవల రవీంద్ర, రామకృష్ణలు తండ్రి జ్ఞాపకార్థం 15 కుర్చీలు పార్టీ కార్యాలయానికి బహూకరించారు.

పాలకొల్లులో..

వీడని వర్షం.. రహదారులు జలమయం

ఆచంట: ఏకధాటిగా కురుస్తున్న వర్షం

ప్రజాశక్తి - ఆచంట

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా వర్షం కురుస్తూనే ఉంది. ఈ వర్షంతో జనజీవనం స్తంభించింది. రహదారులు సైతం బోసిపోయాయి. మండలంలో ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం గ్రామాల్లో ఆవాసాల మధ్యలో నీరు చేరాయి. దీంతో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరోపక్క తాడేరు, నక్కల, డ్రెయిన్ల ఉధృతి కారణంగా పరిసర ప్రాంతాల్లో ఉన్న పంట పొలాలు గత ఆరు రోజుల నుంచి నీటిలోనే నానుతున్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎకరానికి సుమారు పదివేల వరకు పెట్టుబడులు పెట్టామని, వారం రోజులుగా ముంపునకు గురైన పంట పొలాలు కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెనుమంట్ర : మండలంలో ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు వర్షం ఏకధాటిగా కురుస్తుంది. దీంతో ప్రజలు ఎక్కడికక్కడే ఇల్లు కదలకుండా ఉండిపోయారు. ఆదివారం చికెన్, మటన్, చేపలు, రొయ్యలు, పీతలు, కూరగాయలు, ఆకుకూరలు కోసం వచ్చే వినియోగదారులు తగ్గిపోవడంతో బజారులు అన్నీ బేజారు అయ్యాయి. వర్తకులు అంతా డీలా పడ్డారు. ఇదే పరిస్థితి మరో మూడు రోజులు ఉంటుందని అంటున్న నేపథ్యంలో అంతా ఆందోళన చెందుతున్నారు.

పాలకొల్లు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో పాలకొల్లులో ఆదివారం రోజంతా పట్టణంలో చిరు చినుకులు పడుతూనే ఉన్నాయి. దీంతో బయటకు వెళ్లేందుకు వాతావరణం ఇబ్బందిగా ఉండటంతో పలువురు ఇంటికే పరిమితమయ్యారు. ఆదివారం అనేక వివాహ, వార్షికోత్సవాలు ఉన్నాయి. అయితే వాతావరణం అనుకూలించకపోవడంతో వీటికి హాజరు అంతంత మాత్రమే ఉంది. పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె శ్రీజ నిశ్చితార్థంకు చినుకుల ప్రభావం పడింది. దీంతో పలువురు కూటమి నేతలు ఇండ్లకే పరిమితమయ్యారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాలలో ఆదివారం ఉదయం నుండి సాయంత్రం వరకు చిరుజల్లులు కురుస్తూనే ఉంది. రహదారుల చిద్రం అవ్వడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో రహదారులపై వర్షపు నిలిచిపోయింది. వాహనచోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మొగల్తూరు-వెంప, మొగల్తూరు శేరేపాలెం, ముక్కువారి వీధి హై స్కూల్ రోడ్డు శివాలయం వీధి, రామన్నపాలెం, పేరుపాలెం, కేపీ పాలెం, కాళీపట్నం, పాతపాడు తదితర గ్రామాల్లో పక్కా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో రహదారులపై వర్షం నీరు నిలిచిపోయింది.

పెనుగొండ రూరల్ : ఆదివారం మధ్యాహ్నం నుంచి ఏకధాటిగా కురిసిన వర్షం కారణంగా మండలంలోని పలు గ్రామాలలో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు బురదమయంగా మారాయి. మనమర్రు, కొఠాలపర్రు, దేవా, చెన్నమలం, నడిపూడి రోడ్డులో అక్కడక్కడ ఏర్పడిన గోతుల్లో నీరు నిలిచిపోయాయి. రోడ్డు మీద ప్రయాణం చేయలేక ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

భీమవరం : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో జిల్లాలో మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఈ నేపథ్యంలో జిల్లా ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. గంటకు 30-40 కి.మీ. వేగంతో తీరం వెంబడి ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని సూచించారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పైప్ లైన్లను తనిఖీ చేయాలన్నారు. అత్యవసర సమయంలో వినియోగం నిమిత్తం మోటార్ బోట్లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి అధికారులంతా వారి ప్రధాన కేంద్రాల్లోనే ఉండాలని, ఏ ఒక్కరికి సెలవులు మంజూరు చేయడం జరగదని స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 08816 299181 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

రవికుమార్‌కు ఉత్తమ తహశీల్దార్ అవార్డు

ప్రజాశక్తి - పెనుమంట్ర

అవార్డు అందుకుంటున్న తహశీల్దార్ రవికుమార్

స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పెనుమంట్ర తహశీల్దార్ వై.రవికుమార్‌కు ఉత్తమ తహశీల్దార్ అవార్డు రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదుగా అందుకున్నారు. కాగా ఆయనతో పాటు స్థానిక మండల రెవెన్యూ సర్వేయర్ ఎస్.కోదండ రాముడు, వెలగలవారి పాలెం విఆర్ఒ చింతపల్లి గోపాలకృష్ణ, ఎంఆర్ఒ కార్యాలయం టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ పి.రాజా సుధీర్ ఉత్తమ ఉద్యోగి అవార్డ్సు అందుకున్నారు. మండల రెవెన్యూ శాఖ నుండి నరసాపురం డివిజన్ స్థాయిలో డిప్యూటీ తహశీల్దార్‌తో సహా ముగ్గురు ఉద్యోగులు బెస్ట్ సర్వీస్ అవార్డ్సు పొందగా మొత్తం డివిజన్, జిల్లా స్థాయిల్లో ఎనిమిది మందికి అవార్డ్సు రావడం పట్ల పలువురు హర్షం తెలిపారు.

రెండో బ్రాంచి ఏర్పాటు అభినందనీయం

గుంటూరు సుభాని హోటల్ ప్రారంభంలో ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

హోటల్‌ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

భీమవరం జెపి రోడ్డులోని కాలువ గట్టు వద్ద విఎస్ ఎంటర్ ప్రైజెస్ గుంటూరు సుభాని హోటల్‌ను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) ఆదివారం ప్రారంభించారు. ఘుమఘుమలాడే బిర్యానీ, మిర్చి ఘాటు, గోంగూర చట్నీపేరు చెప్పగానే గుంటూరు సుభానీ హోటల్ బిర్యానీ కూడా గుర్తొస్తుందని, మన ప్రాంతంలోనే రెండో బ్రాంచ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎంఎల్ఎ అంజిబాబు అన్నారు. భీమవరం ఎంతో శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, ఎన్నో కార్పొరేట్ సంస్థలు వస్తున్నాయని, మరెన్నో రావాలని అన్నారు. సుభానీ హోటల్ ఎ.ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ భీమవరంలో మొదటి బ్రాంచ్ బైపాస్ రోడ్డులో, రెండో బ్రాంచ్ జెపి రోడ్డులో ప్రారంభించామని, అన్ని రకాల బిర్యానీలు లభిస్తాయని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

కాళ్ల: మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో 12 నిరుపేద కుటుంబాలకు ఆదివారం నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. స్వాతంత్ర సమరయోధులు, రాష్ట్ర రైతు సంఘం నాయకులు కీర్తిశేషులు మంతెన వెంకట సూర్యనారాయణ రాజు తృతీయ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు మంతెన వెంకట రవి వర్మ, మంతెన వెంకట సూర్యనారాయణ రాజు, సుభద్రయ్య ఫౌండేషన్ ఆధ్వర్యాన 12 యానాదుల కుటుంబాలకు నిత్యాసర సరుకులు, వృద్ధులకు దుప్పట్లు, పిల్లలకు దుస్తులు అందించారు. మంతెన శ్రీలక్ష్మి, మంతెన హిమ దుర్గా పాల్గొన్నారు.

నిత్యాసర సరుకులు పంపిణీ చేస్తున్న సభ్యులు

మంత్రి లోకేష్‌ను కలిసిన విప్ నాయకర్

నరసాపురం : రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదివారం మంగళగిరి నుండి జిల్లా పర్యటనలో భాగంగా ప్రయాణ మధ్యలో నరసాపురం నియోజకవర్గానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మంత్రి లోకేష్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం కలిసి పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు కుమార్తె నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను తీర్చండి

ఎపియుడబ్ల్యూజె జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమోహన్

ఉండి : వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించి పత్రిక స్వేచ్ఛను కాపాడాలని ఎపియుడబ్ల్యూజె జిల్లా ఉపాధ్యక్షులు, ఉండి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దుండి కృష్ణమోహన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎపియుడబ్ల్యూజె 68వ వ్యవస్థాపక దినోత్సవం పురస్కరించుకుని ఉండి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కృష్ణమోహన్ ఆధ్వర్యాన ఆదివారం ఉండి మెయిన్ సెంటర్లో జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా దుండి కృష్ణమోహన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అక్రిడేషన్‌కు సర్క్యులేషన్‌తో ముడిపెట్టి కొంతమందికే అక్రిడేషన్ ఇచ్చి జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అర్హులైన జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇవ్వాలని, వాటితో పాటు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు గెద్దా అప్పారావు, ఉండి ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు కైలే రాజు, ట్రెజరర్ బొండాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : జర్నలిస్టుల హక్కులకోసం, సంక్షేమం కోసం ఎన్నో పోరాటాలు సాగించిన చరిత్ర ఎపియుడబ్ల్యూజె సొంతమని, సమస్యల పరిష్కారానికి ఇక ముందు కూడా రాజీలేని పోరాటాలు సాగిస్తుందని యూనియన్ నేతలు ఉద్ఘాటించారు. యూనియన్ 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలోని గాంధీ మండపం వద్ద యూనియన్ పతాకాన్ని సీనియర్ పాత్రికేయుడు షేక్ ఖాదర్ మొహిద్దీన్ ఎగురవేశారు. జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ మాట్లాడుతూ 1957 ఆగస్ట్ 17న ఆవిర్భవించిన ఎపియుడబ్ల్యూజె గత 68 ఏళ్లుగా జర్నలిస్టులకు సంబంధించిన ఎన్నో సమస్యలను పరిష్కరించిందన్నారు. జర్నలిస్టులు అనుభవిస్తున్న అక్రెడిటేషన్, హెల్త్ కార్డ్, బస్ పాస్ వంటి అన్ని సదుపాయాలూ ఎపియుడబ్ల్యూజె సాధించినవేనన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యడ్లపల్లి మురళీకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌వి.లక్ష్మయ్య, ప్రెస్ క్లబ్ కోశాధికారి శీలి రాజు, సీనియర్ పాత్రికేయులు ఎవి.రామరాజు, తేతలి గంగాధరరెడ్డి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

రైతుల అభిమానాన్ని చూడాలి

విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్

నరసాపురం : సహకార సంఘాల అధ్యక్షులు రైతులకు సేవలందించి రైతుల అభిమానాన్ని చూరగొనాలని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అన్నారు. మండలంలోని కొప్పర్రు సొసైటీ అధ్యక్షులుగా ఆదివారం అందే నరీన్ బాధ్యతలు చేపట్టారు. ఆయనతో పాటు సభ్యులుగా కడలి మసీనురావు, మెరుగుమువ్వల భాస్కర రామస్వామి బాధ్యతలు చేపట్టారు. పాలకవర్గం చేత సొసైటీ కార్యదర్శి దొడ్డ గోపాలకృష్ణ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం అందే నరీన్‌కు ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ అధ్యక్షునిగా నియమితులైన అందే నరీన్ సహకార సంఘ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ సహకార రంగంలో ఎటువంటి అవినీతికి తావులేకుండా పని చేసి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కొన్ని సహకార సంఘాల్లో అవినీతి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అందుకు భిన్నంగా కొప్పర్రు సహకార సంఘాన్ని నరీన్ ప్రగతి పథంలో పయనింపజేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎం.ఎ.షరీఫ్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం పయనిస్తోందన్నారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

భీమవరం టౌన్ : ప్రతిభ కలిగిన పేద విద్యార్థికి శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యాన ఆర్థిక సహకారం అందించే కార్యక్రమాన్ని ఆదివారం భీమవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించారు. సిఐ నాగరాజు మాట్లాడుతూ ప్రతిభ కలిగినా.. పేదరికం వల్ల అనేక మంది విద్యార్థులు విద్యకు దూరంగా ఉంటున్నారని, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఎంతో చేయూతను అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వంతోపాటు దాతలు విద్యాభివృద్ధికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ పట్టణానికి చెందిన కారుమూరి సాయి హరిణి ఎఆర్ కెఆర్ మున్సిపల్ హైస్కూల్లో పదో తరగతిలో అత్యధిక మార్కులతోపాటు కడప ఇడుపులపాయలోని ప్రభుత్వ ఐటీ కళాశాలలో సీటు సాధించారని, మెరిట్ కలిగిన ఆ విద్యార్థి పేదరికంతో ఉండటంతో సిఐ నాగరాజు రూ.10 వేల సహకారం అందించారని తెలిపారు. కార్యక్రమంలో కారుమూరి కృష్ణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఉచిత బస్సు ఉన్నా.. ఆటో ప్రయాణం తప్పనిసరి

బస్సు సర్వీసులను పెంచాలని మహిళల వేడుకోలు

ప్రజాశక్తి - గణపవరం

బస్సు కోసం ఎదురుచూస్తున్న మహిళ ప్రయాణికులు

ప్రభుత్వం సూపర్ సిక్స్‌లో భాగంగా ఉచిత బస్సు సౌకర్యం కల్పించినా తమకు ఆటో ప్రయాణం తప్పటం లేదని గణపవరం బస్టాండ్‌లో ఆదివారం మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గణపవరం నుండి తాడేపల్లిగూడెం, భీమవరం, జంగారెడ్డిగూడెం, నారాయణపురం వెళ్లే ప్రయాణికులు ఎక్కువ శాతం ప్రయాణాలు చేస్తారు. అయితే తాడేపల్లిగూడెం, భీమవరం డిపోలకు చెందిన బస్సులు గణపవరం మీదుగా ఈ ప్రాంతాలకు నడుస్తాయి. ప్రతి 45 నిమిషాలకి భీమవరం, తాడేపల్లిగూడెం వెళ్లటానికి బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఉచిత బస్సు ఏర్పాటు చేశాకా బస్సు సర్వీసులు పెంచుతారని ప్రయాణికులు ఆశించిన మేరకు సర్వీసులు పెంచలేదు. దీంతో బస్సు వచ్చే వరకు బస్టాండులో బస్సు కోసం ఎదురు చూడలేక ఆటోలో ప్రయణాలు తప్పటంలేదని మహిళలు అంటున్నారు. ప్రభుత్వం గతంలో గణపవరం నుండి తాడేపల్లిగూడెం, భీమవరం, చేబ్రోలు వెళ్లటానికి షెటిల్ బస్సు సర్వీసులు నడిపేవారని, ప్రస్తుతం కూడా ఉచిత బస్సులను ఈ రూట్లలో నడిపితే తమకు ఉపయోగకరంగా ఉంటుందని ప్రయాణికులు అంటున్నారు. ఆదివారం వస్తే కొన్ని బస్సులకు ట్రిప్పులు తగ్గించి వేయటం వల్ల మరింత ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. ఉచిత బస్సు తమకు ఉపయోగపడే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం

25న కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలు జయప్రదం చేయాలి

ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తిరాజు

ప్రజాశక్తి - భీమవరం

సమాజాభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమం అమలు, పరిపాలనకు దోహదపడిన రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు విమర్శించారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో టి.గంగరాజు అధ్యక్షతన ఆదివారం ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా విచ్చేసిన సత్తిరాజు మాట్లాడుతూ ఇపిఎఫ్ 95 పెన్షనర్లు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రూ.8 లక్షల కోట్లు ఉంటే ప్రతి ఏడాది వడ్డీ కింద రూ.54 వేల కోట్లు వస్తుంటే కేవలం రూ.14 వేల కోట్లు పెన్షన్లు ఇస్తున్నామని గొప్పలు చెప్పుకోవడం రిటైర్డ్ ఉద్యోగులు, కార్మికుల్ని మోసం చేయడమేనన్నారు. ఇపిఎస్ పెన్షన్ దారులకు కనీసం రూ.9 వేలు పెన్షన్ ఉండాలని దేశవ్యాప్తంగా ఆందోళన జరుగుతుంటే కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండడం రిటైర్డ్ పర్సన్స్ పట్ల పాలకుల విధానాలను తెలియజేస్తుందన్నారు. రాష్ట్రంలో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుంటే ఎన్నికల ముందు వాగ్దానాలు చేసిన పాలకులు ఎన్నికల అనంతరం విస్మరించడం తగదని పేర్కొన్నారు. ప్రయివేటు పరిశ్రమల్లో, బ్యాంకుల్లో, సంస్థల్లో పనిచేసిన రిటైర్ ఉద్యోగులందరూ ఏకతాటిపై రావాలని, ఐక్యంగా ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. ఆల్ పెన్షనర్స్ సమస్యలపై ఈనెల 25న కలెక్టరేట్ల వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని, సెప్టెంబర్ 13న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సులను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి.జేమ్స్ మాట్లాడుతూ తాము దాచుకున్న సొమ్మునే రాష్ట్ర ప్రభుత్వాలు ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఆల్ పెన్షనర్స్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వై.అజయ్ కుమార్ మాట్లాడుతూ కనీస పెన్షన్ రూ.7,500 కేంద్రం మంజూరు చేసిందని ప్రచారం చేస్తున్నారని ఇది వాస్తవం కాదన్నారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులు టి.సత్యనారాయణ, సతీష్, ఎస్‌వి.రాఘవులు, పి.శ్రీనివాసరాజు, కె.వెంకటేశ్వర్లు, సోనీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్తిరాజు

ఎంపిపి దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎంపిపి దంపతులకు సత్కారం

కాళ్ల : కాళ్ల మండలాన్ని జిల్లాలో అత్యున్నత స్థాయిలో నిలపడంతో పాటు అందరి మన్ననలు పొందిన ఎంపిపి జిల్లా స్థాయిలో అవార్డు పొందడం హర్షణీయమని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. కోపల్లె లో పలువురు ఉపాధ్యాయులు కాళ్ల ఎంపిపి దంపతులను ఆదివారం సత్కరించారు. 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉత్తమ ఎంపిపిగా అవార్డును జిల్లా పరిషత్ ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ చేతులమీదుగా ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాథ రాజు అందుకున్న విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో గాదిరాజు రామకృష్ణంరాజు, బెల్లంకొండ నాగ మురళీ శ్రీనివాసరావు, రెడ్డి రాంబాబు, బొబ్బిలి రాజమౌళి కోటేశ్వర స్వామి ఎంపిపి దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

షుగర్‌ను అదుపులో ఉంచుకోవాలి

ఎండో వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ జివి.ప్రవీణ్ కుమార్

పాలకోడేరు : షుగర్ వ్యాధి ఉన్న వాళ్లకే వేరికోస్ వీన్స్ సమస్యలు వస్తాయని షుగర్‌ను అదుపులో ఉంచుకోవడం చాలా అవసరమని ఎండో వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ జివి.ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం శృంగవృక్షం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు వంద మందికి వైద్య సేవలు అందించారు. ఉచితంగా కలర్ డాప్లర్ పరీక్షలు చేసి శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించారు. వీరందరిని బుధవారం హైదరాబాద్ తీసుకువెళ్లి ఉచితంగా ఆపరేషన్‌లు చేస్తామన్నారు. ప్రకృతి ఆహారాన్ని నియమబద్ధంగా తీసుకోవడం ద్వారా షుగర్ వ్యాధిని అదుపులో పెట్టుకోవచ్చన్నారు. ఈ శిబిరంలో షేక్ అలీమ్, ఆర్య వైశ్యసంఘం అధ్యక్షుడు గ్రంధి రాజా, సెక్రెటరీ సోము సాయికృష్ణ, ఉపాధ్యక్షుడు పూర్ణారావు, యానాదిశెట్టి, రాము పాల్గొన్నారు.

ఫ్యాన్లు అందిస్తున్న కుటుంబ సభ్యులు

సిపిఎం కార్యాలయానికి ఫ్యాన్లు బహూకరణ

భీమవరం : నిరంతరం ప్రజా సమస్యలపై పనిచేస్తున్న సిపిఎం కార్యాలయానికి ధనాల అప్పన్న, ధనాల బంగారమ్మ జ్ఞాపకార్థం ధనాల నాగమణి వారి కుటుంబ సభ్యులు నాలుగు ఫ్యాన్లు బహూకరించారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావుకి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ శ్రామికులు, కష్టజీవుల పక్షాన నిలబడే సిపిఎం అనేక సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తుందన్నారు. భీమవరంలో ఉన్న సిపిఎం జిల్లా కార్యాలయాన్ని ప్రజా వైద్యశాలగా మార్చి పేదలకు వైద్యం అందిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం జిల్లా కార్యాలయం అద్దె భవన్లోకి మారిందన్నారు. భవనంలో సౌకర్యాలు ఏర్పాటులో భాగంగా మున్సిపల్ వర్కర్‌గా పనిచేసిన ధనాల అప్పన్న ఆయన తల్లి ధనాల బంగారమ్మ జ్ఞాపకార్థం అప్పన్న భార్య నాగమణి కుమార్తె వరలక్ష్మి, మనవడు గణేష్ నాలుగు ఫ్యాన్లు బహూకరించారన్నారు. ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలియజేశారు. సిపిఎం నాయకులు ఎం.వైకుంఠరావు, డి.నాగేశ్వరరావు, ఎం.ఆంజనేయులు పాల్గొన్నారు.

డాక్టర్ భాస్కరరావు సేవలు ఎనలేనివి

సంతాప సభలో డాక్టర్లు

తణుకు : తణుకు పట్టణానికి చెందిన సీనియర్ మత్తు వైద్య నిపుణులు డాక్టర్ గద్దె రామకృష్ణ భాస్కరరావు గత 50 ఏళ్లుగా రోగులకు నిస్వార్థమైన సేవలందించారని తణుకు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఎ) అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆనంద్, డాక్టర్ సుబ్బారాజు అన్నారు. ఆదివారం స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఎ) హాలులో ఇటీవల మృతిచెందిన మత్తు వైద్యులు జిఆర్‌కె.భాస్కరరావు సంతాప సభ ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ ఆనంద్ అధ్యక్షతన జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి ఐఎంఎ వైద్యులు, కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ప్రజా వైద్యులు డాక్టర్ తాతిని రామబ్రహ్మం మాట్లాడుతూ అనేక మంది రోగులకు సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, ఐఎంఎ వైద్యులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలి

సిపిఎం గ్రామ శాఖ డిమాండ్

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం గ్రా మంలో ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని సిపిఎం గ్రామ శాఖ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో మండల నాయకులు బాలం విజయకుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ బొర్రా అలమహారాజు మాట్లాడుతూ మండల కేంద్రమైన వీరవాసరంలో అనేక సమస్యలు ఉన్నాయని, మేజర్ సమస్యగా ఇళ్ల స్థలాల సమస్య ఉందని అన్నారు. అభివృద్ధి గురించి గొప్పగా మాట్లాడుతున్న పాలకులు కనీసం ఇళ్ల స్థలాలు, తాగునీరు, రోడ్లు వేయలేని స్థితిలో ఉన్నారని అన్నారు. సూపర్ సిక్స్ అంటూ స్థానిక సమస్యలను గాలికి వదిలేస్తున్నారని అన్నారు. తక్షణమే ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆంజనేయులు, రెడ్డి రాము, ఎండమూరు సుబ్బారావు, బొబ్బనపల్లి సూర్యచంద్రరావు, శ్యాం పాల్గొన్నారు.

లౌకికవాదంపై అవగాహన ఉండాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాజ్యాంగం, ప్రభుత్వ విధానాలు, లౌకికవాదంపై అవగాహన కలిగి ఉండాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబురావు పేర్కొన్నారు. సిఐటియు మండల కమిటీ సమావేశం ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు మండల అధ్యక్షురాలు కె.నాగమణి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబురావు ముఖ్యఅతిథిగా పాల్గొని భారత రాజ్యాంగం, లౌకికవాదం, సోషలిజం అనే అంశాలపై కార్యకర్తలకు అవగాహన కల్పించారు. రాజ్యాంగం, ప్రభుత్వ విధానాలు, లౌకికవాదం ఇవన్నీ కూడా కార్మికుల అవగాహన పెంచుకోవలసిన ఆవశ్యకత ఉందని ఆయన వివరించారు. రానున్న సిఐటియు మహాసభల ఎజెండాను సిఐటియు నాయకులు జి.దేనా స్వరూప రాణి వివరించారు. ఈ మహాసభల జయప్రదానికి స్కీమ్ వర్కర్స్, బిల్డింగ్ వర్కర్స్ సిఐటియులో ఉన్న అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. సంఘ కార్యదర్శి ఆమంచి సత్యనారాయణ మాట్లాడుతూ సిఐటియు మండల రెండవ మహాసభ ఈనెల 24వ తేదీ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకి తాడేపల్లిగూడెంలో సుందరయ్య భవనంలో జరుగుతుందని ఈ మహాసభకి అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కండెల్లి సోమరాజు, చంద్రగిరి కృష్ణవేణి, మద్దాల అమ్ములు, దెయ్యం గంగాభవాని, ఈ.లక్ష్మి, యడ్లపల్లి గోపమ్మ, కట్టా లక్ష్మి, మరపట్ల మంగా పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

సర్టిఫికెట్ అందిస్తున్న కొత్తపల్లి సుబ్బారాయుడు

రక్తదానం ప్రాణదానంతో సమానమని రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని మూడవరోజు ఆదివారం నరసాపురం నియోజకవర్గం చిరంజీవి యువత ఆధ్వర్యంలో గవర్నమెంట్ హాస్పిటల్‌లో జరిగిన రక్తదాన శిబిరం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. రక్తం దొరక ఏ ఒక్కరు చనిపోకూడదనే చిరంజీవి ఆశయాన్ని అభిమానులు అన్ని ప్రాంతాల్లో నిరంతరం కొనసాగించడం అభినందనీయమన్నారు. కరోనా సమయంలో చిరంజీవి రాష్ట్రవ్యాప్తంగా ఆక్సిజన్ బ్యాంక్స్ ఏర్పాటు చేసి ఎందరో ప్రాణాలను కాపాడారన్నారు. చిరంజీవి పుట్టినరోజుని పురస్కరించుకుని అభిమానులు వారం రోజుల పాటు ప్రపంచవ్యాప్తంగా ఎన్నో ప్రజా ఉపయోగ సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమని ప్రశంసించారు. ఈ శిబిరంలో 22 మంది అభిమానులు రక్తదానం చేయగా ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ కొత్తపల్లి జానకిరామ్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ మాధశెట్టి కోటేశ్వరరావు, ఆసుపత్రి సూపరిటెండెంట్ సంతోష్ కుమార్, అభిమానులు కోపల్లి శ్రీనివాస్, పోలిశెట్టి సత్తిబాబు, బోయిడి శ్రీను, అడ్డాల బాబి, దాసరి కృష్ణాజీ, చెన్నంశెట్టి నాగు, గుగ్గిలపు శివరామకృష్ణ, దివి సత్యన్ , బల్ల సత్తిబాబు, పులపర్తి సుబ్బారావు, ఉలిశెట్టి మూలస్వామి, పిల్ల శ్రీహరి పాల్గొన్నారు.

నేడు డిసిఎంఎస్ బ్రాంచి ప్రారంభం

డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ(చిన్నా)

ప్రజాశక్తి - నరసాపురం

రైతు సేవలు విస్తృతం చేయాలనే లక్ష్యంతో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) ఆధ్వర్యంలో నరసాపురంలో బ్రాంచ్ ఏర్పాటు చేస్తున్నట్లు డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ(చిన్నా) తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణ పరిధిలోని పీచుపాలెంలో ఏర్పాటు చేసిన డిసిఎంఎస్ బ్రాంచిను ఈ నెల 18న సోమవారం ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌చే ప్రారంభించనున్నట్లు చిన్నా తెలిపారు. రైతు అవసరాలను సకాలంలో తీర్చడమే సొసైటీ ముఖ్య లక్ష్యం అన్నారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు 22 బ్రాంచిలు ఉన్నాయని, నరసాపురంలో ఏర్పాటు చేసేది 23వ బ్రాంచి అని వివరించారు. ఈ బ్రాంచ్ ద్వారా వరి, ఉద్యాన పంటలకు సంబంధించిన ఎరువులు, ఆక్వా రైతుకు అవసరమైన మేత తదితర వాటిని రైతులకు అందుబాటులోకి తీసుకుని వచ్చి సకాలంలో సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో బ్రాంచి ఏర్పాటుకు కృషి చేసినట్లు తెలిపారు. ఈ బ్రాంచి ద్వారా అందే సేవలు తీరప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్రాంచిలో సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఎటువంటి అవసరం వచ్చినా నేరుగా తనను సంప్రదించవచ్చని చిన్నా తెలిపారు.

బీచ్‌కు అనుమతి లేదు : ఎస్ఐ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌కు ఆదివారం వచ్చిన పర్యాటకులను స్నానాలు చేయకుండా పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో సముద్ర అలలు ఉధృతంగా మారాయి. సముద్రంలోని స్నానానికి దిగితే ప్రమాదవశాత్తు పర్యాటకులు లోపలికి కొట్టుకుపోయే ప్రమాదం ఉందని ఎస్ఐ జి.వాసు తెలిపారు. వాతావరణ పరిస్థితులు చక్కబడే వరకు బీచ్‌కు పర్యాటలకు అనుమతించమని ఎస్ఐ తెలిపారు.

నేడు పిజిఆర్ఎస్ రద్దు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

అధిక వర్షాల హెచ్చరిక నేపథ్యంలో తాడేపల్లిగూడెం పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం జరగాల్సిన పిజిఆర్ఎస్ రద్దు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. అల్పపీడనం కారణంగా వాతావరణ శాఖ రానున్న మూడు రోజులు అధిక వర్షాల హెచ్చరికల నేపథ్యంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం రద్దు చేయడం జరిగింది. పట్టణ ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమం రద్దు విషయం గమనించి సహకరించవలసిందిగా కమిషనర్ తెలిపారు.

మొగల్తూరు : మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదిక రద్దైందని తహశీల్దార్ కె.రాజకిషోర్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో అధిక వర్షాలు కురుస్తున్నందున పిజిఆర్ఎస్‌ని రద్దు చేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

ముగిసిన స్వాతంత్ర దినోత్సవ పక్షోత్సవాలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్వాతంత్ర సమరయోధుల స్ఫూర్తితో సమ సమాజ నిర్మాణం వైపు ప్రజలంతా అడుగులు ముందుకు వేయాలని, ప్రతి ఒక్కరూ జాతీయ భావంతో మెలగాలని రాజ్యసభ సభ్యులు పాక సత్యనారాయణ అన్నారు. ఆదివారం భీమవరం క్విట్ ఇండియా స్థూపం వద్ద శ్రీవిజ్ఞానవేదిక, క్విట్ ఇండియా స్థూప పున్ణ నిర్మాణ కమిటీ ఆధ్వర్యాన స్వాతంత్ర దినోత్సవ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజ్యసభ సభ్యులు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి మన దేశంపై మమకారంతో జాతీయతా భావాన్ని మనసులో నింపుకోవాలని, నేటి తరానికి స్వాతంత్ర స్ఫూర్తిని తెలియ చెప్పాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. క్విట్ ఇండియా స్థూపం ఒక పర్యాటక కేంద్రంగా చేయడానికి మనందరం కృషి చేద్దామని రాజ్యసభ సభ్యులు సత్యనారాయణ అన్నారు. పక్షోత్సవాల కమిటీ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ క్విట్ ఇండియా స్థూపం ప్రధాన ద్వారంకు దాతలను కోరామని, ఆనంద ఫౌండేషన్ ఛైర్మన్ ఉద్దరాజు కాశి విశ్వనాధరాజు ముందుకు వచ్చారని, బుద్ధిని కాంస్య విగ్రహాన్ని ఎఎస్ఆర్ రాజు చారిటబుల్ ట్రస్ట్, వసుధ ఫౌండేషన్, రాష్ట్ర మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.కృష్ణమోహన్‌లు అందిస్తున్నారని అన్నారు. అనంతరం పక్షోత్సవాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారు. అమరవీరుల కుటుంబ సభ్యులు గొట్టుముక్కల పద్మావతి, రుద్రరాజు కృష్ణంరాజు, పాలకోడేటి కార్తీక్, మ్యాజిక్ స్టార్ బోస్, దేశభక్తులు వడ్డీ సుబ్బారావులను ఎంపీ సత్యనారాయణ సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అరసవల్లి సుబ్రమణ్యం, ఇందుకూరి ప్రసాద రాజు, బిజెపి నాయకులు అల్లూరి సాయి దుర్గరాజు, కోమటి రవి, రమణరాజు పాల్గొన్నారు.

జనసేనలోకి చేరికలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విలువలతో కూడిన పార్టీ జనసేన అని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం వైసిపి నుండి జనసేనలోకి గూడెం మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బొద్దు సాయిబాబా, తాడేపల్లిగూడెం నియోజకవర్గ రెడ్డి సంఘం అధ్యక్షులు ఛాంబర్ ఆఫ్ కామర్స్ కోశాధికారి నాగేందర్ రెడ్డి వారి అనుచరులతో 500 మంది జనసేనలోకి చేరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ వారికి జనసేన కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి, తాడేపల్లిగూడెం మండల అధ్యక్షుడు అడప ప్రసాద్, పెంటపాడు మండలం అధ్యక్షుడు పుల్ల బాబి, తోటరాజ, సబ్జా సుబ్బు, చాపల రమేష్, పైపోయిన రఘు, పైబోయిన వెంకటరామయ్య, పాలూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నరసాపురం: మండలంలోని మల్లవరం ఎంపిటిసి ఇంజేటీ మేరీ రత్నం వైసిపిని వీడారు. ఆదివారం నరసాపురం పట్టణం జనసేన కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సమక్షంలో జనసేనలో చేరారు. ఎంపిటిసి మేరీరత్నంతో పాటు గ్రామంలోని పలువురు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన పలువురుకి ఎంఎల్ఎ నాయకర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి వెంకటేశ్వరరావు, ఆకన చంద్రశేఖర్, వలవల నాని, మైల వసంతరావు, నిప్పులేటి తారక రామారావు, బందేల రవీంద్ర, వల్లభ రెడ్డి రామకోటి పాల్గొన్నారు.

వైసిపి నాయకుల వ్యాఖ్యలు తగవు: టిడిపి

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రజల చేత ఘోరంగా తిరస్కారం పొంది, కనీసం ప్రతిపక్షం హోదా కూడా దక్కని వైసిపి చోటా, మోటా నేతలు కుహనా విమర్శలు మానుకోవాలని పెనుమంట్ర టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు వెలగల బుల్లి రామిరెడ్డి, గూడూరి మురళీమోహన్ అన్నారు. ఆదివారం వారు పత్రికల వారితో మాట్లాడుతూ ఇటీవల రాష్టంలో జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట ఎన్నికల్లో టిడిపి అభ్యర్థుల గెలుపుని జీర్ణించు కోలేక ఆచంట వైసిపి గ్రామ నాయకుడు వైట్ల కిషోర్ కుమార్ తరచూ వాట్సాప్ మీడియా వేదికగా విమర్శలు చేయడం తగదని వారు అన్నారు. త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాలు కూటమి పార్టీల అభ్యర్థులు క్లీన్ స్వీప్ చేయడం ద్వారా వైసిపి నాయకుల అందరి నోళ్లు శాశ్వతంగా మూతపడ్డం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు.

బండి ముత్యాలమ్మ ఆలయంలో యాత్రికులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో సందడి నెలకొంది. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యాన ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్‌కుమార్, ఛైర్మన్ కడలి మాణిక్యాలరావుల పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.